

## నర్సాపూర్ నుండి వెల్దుర్తి మీదుగా యాదగిరిగుట్టకు 02 నూతన బస్సు సర్వీస్ ప్రారంభం



# సంగారెడ్డి మెదక్

మంగళవారం18 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:10

# నిరుద్యోగ యువత భవితకు భరోసా

## - జాబ్ మేళాపోర్టల్ ప్రారంభించిన...

### - మంత్రి వివేక్ వెంకటస్వామి








**మనోహరాబాద్, ఆగస్టు 17(ప్రజా జ్యోతి)**

తెలంగాణలోని తొలి సారిగా జిల్లాలలో జాబ్ మేళా పోర్టల్ రూపొందించడంలో మెదక్ ప్రథమ స్థానం సోమవారం,జిల్లా కలెక్టర్ చొరవతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై. ప్రత్యేక శ్రద్ధ కల్పిస్తున్నట్లు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.మెదక్ ఎంప్లాయ్‌మెంట్, స్కిల్స్ & ఇండస్ట్రీ కనెక్ట్ జాబ్ మేళా పోర్టల్ప్రారంభోత్సవంలో మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.మెదక్ జిల్లా ఇంచార్జి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పర్యటనలో భాగంగా శాంతాబయోటిక్స్ పరిశ్రమలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రత్యేక చొరవతో , సీనియర్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల సమక్షంలో మెదక్ ఎంప్లాయ్‌మెంట్, స్కిల్స్..ఇండస్ట్రీ కనెక్ట్ జాబ్ మేళా పోర్టల్‌ను జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు ప్రారంభించారు.

మిగతా 2 లో




# ఫారం పండు నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా జాప్యం..!

### - లబ్దిదారుడినీ ఇబ్బంది పెడుతున్న ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్..

### - ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్.. రైతుకు తప్పని నిరీక్షణ..

### - మన్నాన్‌పల్లి గ్రామంలో వెలుగులోకి వచ్చిన అధికారుల నిర్లక్ష్యం.

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

రైతులకు సాగునీటి వసతి కల్పించడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫారం పండు నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తోంది.

మిగతా 2 లో



# నిరుద్యోగ యువత భవితకు భరోసా

## జాబ్ మేళాపోర్టల్ ప్రారంభించిన...

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు.గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత భవితకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక చేయూతనందిస్తుందన్నారు. మెదక్ జిల్లాలో జాబ్ మేళా ఈ పోర్టల్ అనేది విద్యార్థులు, ఉద్యోగార్థులు, నైపుణ్య సంస్థలు మరియు స్థానిక పరిశ్రమలను ఒకే, ధృవీకరించబడిన వ్యవస్థపై అనుసంధానించడానికి జిల్లా స్థాయిలో అభివృద్ధి చేయబడిన ఒక డిజిటల్ వేదిక. అని తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టరేట్‌కు చెందిన జిల్లా ఐటీ బృందం మరియు ఐటీసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయబడిన జాబ్ మేళా జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేకమైన, సమీకృత ఉపాధి–నైపుణ్య వేదికను ప్రారంభించిన తెలంగాణలోని తొలి జిల్లాలలో మెదక్‌ను ఒకటిగా నిలబెట్టింది. అని అభివర్ణించారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐటీఐ, పాలిటెక్నిక్‌లు, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల కోసం జాబ్ మేళాఅనేది ఒక రెండు–ట్రాక్ రిజిస్ట్రేషన్ ప్లాట్‌ఫారమ్. ఇది ధృవీకరించబడిన విద్యార్థి ప్రొఫైల్‌లను యజమానుల అవకాశాలతో సరిపోల్చడానికి వీలు కల్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ ప్రత్యక్ష ప్రసారం కాకముందే వారి సంస్థచే ధృవీకరించబడేలా నిర్ధారిస్తుంది –అని తెలిపారు. ఇందులో ప్రతి కళాశాల నుండి ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు ప్లేస్‌మెంట్ మేనేజర్లుగా వ్యవహరిస్తారన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో 100 ఇండస్ట్రీలు కలవని వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఏ పరిశ్రమలో జాబు పొందాలో వారికి తెలియని పరిస్థితి ఉందని, చాలామంది హైదరాబాదు వంటి నగరాలకు ఉద్యోగాల గురించి వెళ్తున్నారని అలా కాకుండా మన జిల్లాలోని నిరుద్యోగ యువత వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు అన్నారు. ఈ పోర్టల్ ద్వారా అన్ని ఇండస్ట్రీకు లాగిన్ పాస్వర్డ్ ఇస్తున్నామని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, అ లా చైర్పర్సన్ సుబ్బారావు, ఐ టి సి ఆనంద్, ఈడియం సందీప్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ నుండి వెల్దుర్తి మీదుగా యాదగిరిగుట్టకు

## నూతన బస్సు సర్వీస్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి




**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఆగస్టు 15:**

ప్రయాణికుల సౌకర్యార్థం నర్సాపూర్ డిపో నుండి యాదగిరిగుట్టకు నూతన బస్సు సర్వీస్ సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. నర్సాపూర్ నుంచి బయలుదేరే ఈ బస్సు మంగలపర్తి, వెల్దుర్తి, తూప్రాన్, గజ్వేల్ మీదుగా యాదగిరిగుట్టకు చేరుకోనుంది.యాదగిరిగుట్టకు నేరుగా బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో వెల్దుర్తి మండల పరిధిలోని ప్రయాణికులు, ముఖ్యంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.బస్సు ప్రారంభోత్సవంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొని జలాల్‌పూర్‌లోని కాళికామాత ఆలయం వద్ద నూతన బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సర్వీస్‌ను ప్రారంభించారు.యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులకు రవాణా కష్టాలు తొలగేలా నూతన బస్సు సర్వీస్ అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలకు పరిష్కారం

**రాయికోడ్ ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే ఉద్దేశంతో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎంపీడీవో ఏం. షరీఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి,ప్రభుత్వ పథకాలు, స్థానిక సమస్యలు తదితర అంశాలపై ప్రజలు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని అధికారులు సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఆశాజ్యోతి,ఎంపిఓ సారిక,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# ఫారం పండు నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా జాప్యం..!

మొదటిపేజీ తరువాయి

అయితే క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు అధికారులు ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలంలో ఫారం పండు నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు కోరగా, సంబంధిత ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ నుంచి స్పందన సరిగా లేదని రైతు వాపోతున్నాడు. అనుమతుల కోసం అధికారులను విన్నవించిన పనులు ముందుకు సాగడం లేదని ఆరోపిస్తున్నాడు.

### రైతులకు ప్రోత్సాహం ఎక్కడ..?

ఫారం పండు నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అనుమతుల ప్రక్రియలో జాప్యం జరిగితే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

### జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి

ప్రభుత్వ ఆదేశాలను పక్కనపెట్టి లబ్ధిదారులను అనవసరంగా తిప్పుకుంటున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఫారం పండు నిర్మాణానికి అర్హత ఉన్న లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# రైతు బీమా పథకాన్ని నిరంతరంగా కొనసాగించాలి,,

**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 17:**

రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్న రైతు బీమా పథకాన్ని ఎలాంటి విరామం లేకుండా కొనసాగించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతు బీమా పథకం ద్వారా రైతు కుటుంబానికి ఆధారమైన వ్యక్తి అనుకోని మరణానికి గురైనప్పుడు రూ. 5 లక్షల బీమా సాయం అందడం వల్ల ఆ కుటుంబానికి ఆర్థికంగా ఎంతో భరోసా కలుగుతుందని ఆయన తెలిపారు.రైతు కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా ఈ పథకం కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. 202526 సంవత్సరానికి సంబంధించిన రైతు బీమా కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో 202627 సంవత్సరానికి కూడా ఈ పథకాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగించేలా ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని మైసయ్య యాదవ్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్,జిల్లా కార్యదర్శి బోయిని రమేష్ యాదవ్,జిల్లా ఉపాధ్యక్షులు కే.అశోక్ రెడ్డి,జిల్లా ముఖ్య సలహాదారు కొండ ఎల్లం యాదవ్,జిల్లా సభ్యులు పి. మల్లేష్,పరశురాం తదితరులు పాల్గొన్నారు.



# మాణిక్ ప్రభుఆలయ కమిటీ అధ్యక్షునిగా ఆమేటి కిట్టు..!

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**



సంగారెడ్డి పట్టణంలోని మాణిక్య ప్రభు మందిరం ఆలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వైజర్ గా తోపాజి అనంత కిషన్, అధ్యక్షునిగా అమేటి కృష్ణ (కిట్టు) ప్రధాన కార్యదర్శి గా కొవ్వూరు హనుమంతు, కోశాధికారిగా నాయి కోటి నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, అశోక్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్ గౌడ్, కొండాపురం జగన్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పరమేశ్వర్ గౌడ్, గుండ్లపల్లి నరేష్ కుమార్, సహాయ కా దర్శులుగా నామ శ్రీనివాస్, అమేటి రాజేంద్ర ప్రసాద్,గౌరవ అధ్య క్షులుగా ఆమెటి మహేందర్, సలహాదారులుగా మిఠాయి నారాయణ, ఆమెటి ప్రభులింగం, కొంపల్లి విద్యా సాగర్, పంపాటి కృష్ణ మూర్తి, ప్రహ్లాద్, అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా సురేష్, బలవంతరావు, ర్యాకల సంతోష్ కుమార్, కాంశెట్టి శంకర్, శంకర్, వెంకట్, మధు, పెంటయ్య, అనుముల సంతోష్, శేఖర్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు ఆమెటి కృష్ణ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కార్యవర్గ సభ్యులు పూర్తి స్థాయిలో కృషి చేస్తారని చెప్పారు.

# కోమటిపల్లిలో రూ.2.50 లక్షలతో ఉచిత వాటర్ ప్లాంట్





**మెదక్ (ప్రజాజ్యోతి )**




ఎన్నికల హామీ మేరకు సొంత నిధులతో నిర్మాణం ప్రారంభించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రామాయంపేట మున్సిపల్ పరిధిలోని కోమటిపల్లి రెండో వార్డులో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో సుమారు రూ. 2.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఉచిత నీటి శుద్ధీకరణ యంత్రాన్ని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం ప్రారంభించారు.మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తన స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సొంత నిధులతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ...ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావించానని, అందులో భాగంగానే సొంత నిధులతో వాటర్ ప్లాంట్‌ను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగిస్తానని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని వార్డుకు ఉచిత వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై కోమటిపల్లి గ్రామ ప్రజలు హర్షం



వ్యక్తం చేశారు.అనంతరం వార్డు కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్ ఆధ్వర్యంలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. సొంత నిధులతో వాటర్ ప్లాంట్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్, కౌన్సిలర్లు మద్దెల మాధవి, రమేష్, చరిత, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కల్వకుంట సర్పంచ్ అందెకొండ రెడ్డి, రాజు యాదవ్, పాతూరు సిద్ధరాములు, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, శ్యామ్ రెడ్డి, హైమద్, మావురం రాజు, విద్యాకర్ తదితరులతో పాటు కోమటిపల్లి గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్హేర్‌లో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**కల్హే ర్. 17.ఆగస్టు ప్రజా జ్యోతి.**





కల్హేర్: నాగుల పంచమి పండుగను ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, భక్తులు ఉదయం నుంచే సమీపంలోని పుట్టల వద్దకు చేరుకుని నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు, నైవేద్యాలు సమర్పించి పసుపు, కుంకుమలతో నాగదేవతను పూజించారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు మొక్కుకున్నారు. ఆలయాలు, పుట్టల వద్ద భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.కల్హేర్, మార్ధి, మాసనపల్లి, బీబీపేట్, ఖానాపూర్, మహాదేవపల్లి, మీరాఖాన్‌పేట్, కృష్ణాపూర్, ఇందిరానగర్, రాపర్తి తదితర గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాగదేవతకు కరువు కాటకాలు తొలగి, మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను

## - కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసే ప్రయత్నం చేస్తుంది



మెదక్ (ప్రజాజ్యోతి )

- పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన కేసిఆర్ ఈ పథకాలను అమలుచేసిండు
- నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేక ప్రజలతో చెలగాటమాడుతున్నారు
- యాప్ ల పేరా రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యింది
- చట్టబద్ధత కోసం హైకోర్టులో కళ్యాణలక్ష్మి పథకం పై కేసు వేస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం తడిబట్టవేసుకోని కాలయాపన చేస్తుంది
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దుచేస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది
- కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులుచెరిగిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మంది కుటుంబాలకు అండగా నిలిచారని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న ఈ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆమె ఆరోపించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ ఎత్తున మెదక్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో రాస్తారకో, ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సరైన అవగాహన లేకుండా ప్రజలతో చెలగాటమాడుతోందని పద్మాదేవేందర్ రెడ్డి మండిపడ్డారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ పథకాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ హైకోర్టులో కేసు వేస్తే, ప్రభుత్వం తడిబట్ట వేసుకుని కూర్చున్నట్లుగా వ్యవహరిస్తూ సమస్యను పరిష్కరించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. అదేవిధంగా రైతులకు యూరియా అందించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకుని, వారికి అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తున్నాయని, వాటిని రద్దు చేయాలని చూస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాలను స్పష్టం చేయాలని, సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు.




ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఇన్ ఛార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆరేళ్ళ మల్లిఖార్జున్ గౌడ్, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ గడ్డమీది క్రిష్ణా గౌడ్, న్యాయవాది జీవన్ రావు, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లు మామిండ్ల ఆంజనేయులు, మ్యాదరి దీపక్ కుమార్, సాయి, జుబేర్ అహ్మద్, మాయా గంగమణి మల్లేశం, రామాయంపేట బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ చరిత లతో పాటు మెదక్, రామాయంపేట, హవేలి ఘన్పూర్  పాపన్నపేట, నిజాంపేట, శంకరంపేట మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి సోములు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారావు లతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గోన్నారు.

# కల్హేర్‌లో వినాయక భవనానికి భూమిపూజ.!

## వివేకానంద యువజన సంఘం

కల్హేర్, ఆగస్టు 17: ప్రజాజ్యోతి



కల్హేర్ మండలం ఖానాపూర్ (కె) గ్రామంలో వినాయక భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివేకానంద యువజన సభ్యుల విజ్ఞప్తి మేరకు, సర్పంచ్ హరినాయక్ ఇచ్చిన హామీతో ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ గైని జక్కరయ్య, గ్రామ కమిటీ సభ్యులు, వివేకానంద యువజన సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామంలో వినాయక భవనం నిర్మాణం చేపట్టడం పట్ల యువజన సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# పుట్టలలో పాలు పోసిన మహిళా మణులు

మెదక్ (ప్రజా జ్యోతి)

హిందూ సాంప్రదాయం ప్రకారం శ్రావణమాసం మొదటి పంచమి రోజును నాగుల పంచముగా జరుపుకుంటారు. ఈ రోజున చీమలు పెట్టిన పుట్టలో పాములు కిరవైనట్టు సామెతలో భాగంగా హిందూ మహిళ మణులు తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి పుట్టలలో పాలు కోయడం  జొన్న పేలాలు  తీసుకెళ్లి నాగదేవతను పూజిస్తారు నాగదేవత మమ్మల్ని చల్లగా చూడు అని వారు నాగదేవతను మొక్కడం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుంది పుట్టలున్న ప్రతి గుడి దగ్గర భక్తులు మహిళామణులు అధిక సంఖ్యలో పాల్గొని గుడిలో పూజలు నిర్వహించడం జరిగింది.







# పోస్టల్ కవర్ పై మెదక్ ఖిల్లా






**మెదక్ (ప్రజా జ్యోతి)**

తెలంగాణ వైభవాన్ని కాకతీయ శిల్పకళా ప్రతీకగా నిలిచే మెదక్ ఖిల్లా (మెదక్ కోట) కీర్తి మకుటంలో మరొక అరుదైన గౌరవం చేరింది. భారతీయ తబలా శాఖ మెదక్ కోట చరిత్ర ప్రాధాన్యతను గుర్తించి దానికి విశిష్టతను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా ప్రత్యేక పోస్టర్ కవర్ మరియు స్మారకముద్రను సోమవారం మెదక్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో మెదక్ ఖిల్లా పై ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తపాల శాఖ అధికారి విజయకుమార్ మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ జిల్లా అదనపు ఎస్పీ మెదక్ ఆర్డిఓ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతిరాజ్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ జిల్లా ప్రముఖులు పాల్గొని పోస్టల్ కవర్  మరియు స్మారక ముద్ర ను  ఆవిష్కరించడం జరిగింది.

# కమిషనర్‌పై కౌన్సిలర్ ల ఆగ్రహం

**జిన్నారం(ప్రజాజ్యోతి)**

మున్సిపల్ కమిషనర్ నరేందర్‌రెడ్డి తీరుపై పలువురు కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కమిషనర్‌ను కౌన్సిలర్ లు కృష్ణ, పర్వతాలు, కుమారస్వామి, వెంకటేష్, స్వప్న రాజేందర్‌రెడ్డి, దీన ప్రవీణ్ నిలదీశారు. మున్సిపాలిటీలో అనుమతులు, పన్నుల వసూళ్లు, అధికారిక సమాచారంపై కమిషనర్‌ను ప్రశ్నించారు. అనుమతుల విషయంలో డబ్బులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారంటూ కౌన్సిలర్ లు ఆరోపించారు. ఈ సందర్భంగా కమిషనర్ తమతో దురుసుగా మాట్లాడటంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్ ల ను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఊట్ల గ్రామంలోని రాధా కన్వెన్షన్‌కు సంబంధించిన అనుమతుల వ్యవహారంపైనా కౌన్సిలర్ లు ప్రశ్నలు సంధించారు. సంబంధిత అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ఆస్తి పన్ను ఎందుకు వసూలు చేశారని కమిషనర్‌ను నిలదీశారు. మున్సిపాలిటీకి సంబంధించిన కీలక సమాచారం, అనుమతులు, పన్నుల వివరాలను కౌన్సిలర్లకు అందించడం లేదని ఆరోపించారు. కమిషనర్ వ్యవహారశైలిపై కౌన్సిలర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మున్సిపల్ పరిపాలనలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. అనుమతులు, పన్నుల వసూళ్లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కమిషనర్‌ను జిన్నారం నుంచి వెంటనే బదిలీ చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.





# కలెక్టర్ కార్యాలయంలో మహిళలకు స్మార్ట్ కార్డు పంపిణీ



**మెదక్ (ప్రజాజ్యోతి )**



మెదక్ లోని కలెక్టర్ కార్యాలయంలో మహిళలకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే రోహిత్ రావ్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ  మహిళలకు అనేక కార్యక్రమాలు చేయాలని ప్రభుత్వం భావిస్తుందని వైయస్ హయాంలో పావుల వడ్డీ రుణం ప్రారంభించారని గుర్తు చేశారు 23 వేల కోట్ల రూపాయలతో మహిళలకు రుణాలు అందించామని ఈవి వాహనాలను కూడా మహిళలకు అందిస్తున్నామని మహిళలకు బస్సు ఫ్రీ సదుపాయం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లలకు స్కూళ్లలో సన్న బియ్యం మంచి భోజనం పెడుతున్నామని సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులను మంచి భోజనం పెడుతున్నామని త్వరలో విద్యార్థులకు ఫ్రీ టిఫిన్ పెడతామని ప్రతి సంక్షేమ పథకం పేదలకు ఉపయోగపడేలా ప్రజా ప్రభుత్వం సంకల్పం అన్నారు గత ఏడాది మూడువేల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని ఈ ఏడాది 2500 ఇస్తామని తెలిపారు ఏ ఊర్లో పెంకుటిల్లు కనిపించవద్దని  ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు వైద్యం అందిస్తున్నామని విద్యా వైద్యానికి ప్రభుత్వము మొదటి ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పబ్లిక్ స్కూల్స్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపిస్తాము అని వివరించారు ఉచితంగా 200 కరెంటు ఇస్తున్నామని. ఈ విధంగా అనేక ప్రభుత్వ పథకాల గురించి మంత్రి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ గ్రంథాలయ చైర్మన్ సువాసినీ రెడ్డి ట్రైన్ ఆర్డిఓ అహమ్మద్  మెదక్ రామయంపేట్  తూప్రాన్ నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# నల్లవాగు నీటిని వెంటనే విడుదల చేయాలి

## - కళ్యాణ లక్ష్మి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి

## - మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 17:**

నల్లవాగు ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పంటలకు నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. రైతుల పంటలను కాపాడేందుకు నల్లవాగు నీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ ఉమా హారతికి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో నల్లవాగు ప్రాజెక్టు పరిధిలో సాగు చేసిన వరి పంటలు నీటి కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల కోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడితే తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ పంటలకు విడుదల చేయకపోవడం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యమని ఆయన విమర్శించారు. రైతుల పంటలు ఎండిపోకుండా వెంటనే నీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవుతోందని ఆరోపంచారు. కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎలాంటి షరతులు, కోతలు లేకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ప్రజలకు ఇచ్చిన



మాటను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. నారాయణఖేడ్ నియోజకవర్గ రైతుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలని అన్నారు. రైతులకు సాగునీరు అందించడంతో పాటు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.నల్లవాగు ప్రాజెక్టు నీటిని వెంటనే పంటలకు విడుదల చేయాలని, కళ్యాణ లక్ష్మి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత బలంగా పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోస్టాఫీసు లేక.. ప్రజలకు పోస్టు కష్టాలు!

### 4 వేల మందికి తప్పని 6 కిలోమీటర్ల ప్రయాణం

### ప్రభుత్వ పథకాల నగదు కోసం నేరడిగుంటకు పరుగులు

### కన్సాన్‌పల్లిలో పోస్టు కేంద్రం ఏర్పాటుకు ప్రజావాణిలో వినతి

**అందోల్, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):**

కన్సాన్‌పల్లి గ్రామస్థులకు పోస్టు సేవలు అందుకోవడంలో దశాబ్దాలుగా పెద్ద సమస్యగా మారింది. గ్రామపంచాయతీ పరిధిలోని కన్సాన్‌పల్లి, శేరిమల్లారెడ్డిపల్లి గ్రామాల్లో సుమారు 4 వేల మంది జనాభా ఉన్నప్పటికీ ప్రత్యేక పోస్టు కేంద్రం లేకపోవడంతో సుమారు 6 కిలోమీటర్ల దూరంలోని నేరడిగుంటపై ఆధారపడాల్సి వస్తోంది.పోస్టు సేవలతో పాటు ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు పోస్టు ఖాతాల్లో జమ కావడంతో వాటిని తీసుకునేందుకు కూడా నేరడిగుంటకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు తెలిపారు. నెలలో ఒకటి రెండు రోజులు మాత్రమే పోస్టుమాస్టర్ గ్రామానికి వచ్చి నగదు చెల్లింపులు చేస్తున్నారని, అత్యవసర పనుల కోసం మిగతా రోజుల్లో నేరడిగుంటకు వెళ్లక తప్పడం లేదన్నారు.

**వృద్ధులు, మహిళలకు మరింత ఇబ్బంది**

ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణించడం వల్ల వృద్ధులు, మహిళలు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి161కు సమీపంలో ఉన్న గ్రామానికి ఇప్పటికైనా పోస్టు సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**ప్రజావాణిలో గళం వినిపించిన యువత**

దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ కన్సాన్‌పల్లి యువకులు ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పోస్టాఫీసు లేదా ప్రత్యేక పోస్టు కేంద్రం ఏర్పాటు చేసేలా తపాలా శాఖ అధికారులకు సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. "ప్రజల అవసరాలు పెరుగుతున్నా.. పోస్టు సేవల కోసం మాత్రం ఇంకా 6 కిలోమీటర్లు వెళ్లాల్సిందేనా?" అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.



# శ్రీ శ్రీ శ్రీ నాగేశ్వర మందిర ప్రారంభ మహోత్సవ కార్యక్రమం

## - ముఖ్య అతథిగా పాల్గొన్న సిద్దు రావణ్



**జహీరాబాద్, ఆగస్టు 17 (ప్రజా జ్యోతి న్యూస్)**

శ్రావణ మాసంలో వచ్చే నాగుల పంచమి పండుగను అత్యంత శ్రద్ధ భక్తితో భక్తులు జరుపుకుంటారు. ఇది కేవలం పాములకు పాలు పోసి ఆచారమే కాకుండా ప్రకృతిని భూమిలోని జీవశక్తిని గౌరవించాలని బోధిస్తుంది. క్షమ... సమతుల్యత... మన లోని కోపం, అహంకారం వంటి విషపు ఆలోచనలను అణిచివేయాలని సందేశం



ఇస్తుంది. పూజలో పాలు శాంతికి ... బెల్లం మధురత్వానికి ... కొబ్బరికాయ స్వచ్ఛతకు... వడపప్పు సరళతుకు.. ప్రత్యేకగా ఉంటాయని నాగుల పంచమి పండుగను ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ అన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ మండలం కాసిం పూర్ గ్రామంలో నూతన నాగేశ్వర మందిర ప్రారంభ మహోత్సవం శ్రీ శ్రీ మానసా దేవి మందిరం దగ్గర అత్యంత వైభవంగా జరిగింది గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కూడా జరిగింది. ముఖ్యఅతిథి సిద్దు రావణ్ ని సర్పంచ్, గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ మరియు శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్దు రావణ్ గ్రామ సర్పంచ్, భీమ్ ఆర్మీ నాయకులు బాలరాజు, నరసింహ, ధనరాజ్, రాహుల్, రవీందర్ గ్రామ సర్పంచ్ రవి పెద్దలు యువకులు అనంతరం, అశోక్, శ్రీనివాస్ సదానంద్ ,శ్రీకాంత్, సుభాష్ గోపాల్, శ్రీనివాస్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# రామ్ నగర్ లో మురికి కాలువ నిర్మాణానికి శ్రీకారం

- ప్రజల సమస్యలకు శాశ్వతపరిష్కారం దిశగా మున్సిపల్: చైర్మన్ మహమ్మద్ యూనుస్



**జహీరాబాద్, ఆగస్టు 17 (ప్రజా జ్యోతి న్యూస్)**

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు రామ్ నగర్ లో ప్రజలకు ఎంతో కాలంగా అవసరమైన మురికి కాలువ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శంకుస్థాపన చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి, కాంక్రీట్ సిమెంట్ పోసి నిర్మాణ పనులను ప్రారంభించారు. రాంనగర్ లో మురుగు నీటిపారుదల సక్రమంగా లేకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కొత్తగా మురికి కాలువ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కాలువ నిర్మాణం పూర్తయిన అనంతరం మురుగు నీరు నిలిచిపోకుండా సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఏర్పడడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తగ్గే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసర మైన మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను గుర్తించి వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. రామ్ నగర్ లో చేపడుతున్న మురికి కాలువ నిర్మాణం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగితిన పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో నీరు నిలిచి పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ ను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.రామ్ నగర్ లో మురికి కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి నిర్మాణ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ కు వార్డు కౌన్సిలర్ సోనియామ్మ యిర్మీయా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి.ప్రభాకర్ వార్డు కౌన్సిలర్ సోనియమ్మ యిర్మియా, ఏఈ వెంకటేష్, సినియర్ నాయకులు మొయొద్దీన్ గౌరీ మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# 20న ఉచిత మెగా డెమో, స్క్రీనింగ్ టెస్ట్

-నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి:

బొంపల్లి ప్రకాష్




**నారాయణఖేడ్, ఆగస్టు 17:**

పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నారాయణఖేడ్ నియోజకవర్గ నిరుద్యోగ యువత కోసం రితిన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచిత మెగా డెమో, స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్, మోటివేషన్ స్పీకర్ బొంపల్లి ప్రకాష్ తెలిపారు.సోమవారం బోరంచ నల్ల పోచమ్మ ఆలయంలో ఇన్చార్జి సంగీత, పెద్దలు పాండు తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్కు చెందిన ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 20న నారాయణఖేడ్లో ఉచిత మెగా డెమో, స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కోచింగ్ కోసం హైదరాబాద్కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నారాయణఖేడ్లోనే రితిన్స్ అకాడమీ స్టడీ హాల్లో నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని కోరారు.ఇప్పటికే జహీరాబాద్లోని రితిన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్లో పోలీస్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తూ విజయాలు నమోదు చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా నారాయణఖేడ్లోనూ విద్యార్థులు రితిన్స్ అకాడమీలో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. మరిన్ని వివరాలకు 83099 22874, 95029 12165 ఈ నెంబర్లపై సంప్రదించాలన్నారు.



# ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల

- సవరణలు నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలి

-ఖేడ్ మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 17:**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్2026 ప్రక్రియలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి, వార్డు అధికారులు సోమవారం ప్రచురించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి అర్హత కలిగిన ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఐఆర్కు ముందు 17,550 మంది ఓటర్లు ఉండగా, ఎస్ఐఆర్ అనంతరం ప్రచురించిన డ్రాఫ్ట్ జాబితాలో 12,572 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా లేదా ఏవైనా అభ్యంతరాలు ఉన్నా నిర్ణీత గడువులో క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్2026 సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు దావాలు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ అక్టోబర్ 15 వరకు కొనసాగనుందని, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారని తెలిపారు.ఓటర్లు తమ వివరాల్లో సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారిక ఓటర్ సేవల ద్వారా కూడా తమ పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవచ్చని తెలిపారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్రను అడ్డుకోవాలి



## - పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకైన పథకాలను కొనసాగించాలి

## - ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు

**జహీరాబాద్, ఆగస్టు 17 (ప్రజా జ్యోతి న్యూస్)**



కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యం లో సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌర వానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదని, తెలంగాణ లోని పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభించిన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116 కు, అనంతరం రూ. 1,00,116కు పెంచిందని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కరోనా వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కల్యాణలక్ష్మి ద్వారా పేదింటి ఆడ బిడ్డలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఎన్నికల సమయం లో కల్యాణ లక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి, దానినే రద్దు చేసే ప్రయత్నం చేస్తోందని మాణిక్ రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా కల్యాణ లక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తి స్థాయిలో పంపిణీ కాకుండా నిలిచిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్క రించి, లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్నసమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమని ఎమ్మెల్యే అన్నారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజ నాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేక పోయిందని నిలదీశారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలను రాజకీయ కక్షతో నిర్వీర్యం చేయకుండా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించా లని ఎమ్మెల్యే మాణిక్ రావు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీఅధ్యక్షులు వెంకటేశం,మొగుడం పల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, కౌన్సిలర్లు, నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో ప్రజావాణి కార్యక్రమం..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపే ఉద్దేశంతో కొండాపూర్ మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో సౌమ్య శ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో సౌమ్య సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను ప్రజావాణి ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండలంలోని పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## సర్పంచుల సంఘం సంగారెడ్డి జిల్లా జే.ఏ.సి అధ్యక్షులుగా వినోద్ రాథోడ్..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

తెలంగాణ సర్పంచుల సంఘం జే.ఎ.సి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా కొండాపూర్ మండల పరిధిలోని శివన్నగూడ గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ సర్పంచుల సంఘం జె.ఎ.సి వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ చేతుల మీదుగా వినోద్ రాథోడ్ నియామక పత్రాన్ని అందుకుని పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వినోద్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచుల హక్కులు, సమస్యలపై ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా నుంచి సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, మహేష్, డప్పు క్రిష్ణ, నేనావత్ రాంచందర్ నాయక్, మాజీ సర్పంచ్ అరవింద్ రెడ్డి, ఉప సర్పంచ్ శంకర్ నాయక్‌తో పాటు శివన్నగూడెం గ్రామ యువకులు జైసింగ్, ప్రశాంత్, విజయ్, అరుణ్ రాజు తదితరులు పాల్గొని వినోద్ రాథోడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## కల్హేర్: ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

### - ఎంపీడీవో హరి నందన్ రావు

**కల్హేర్, ఆగస్టు 17: ప్రజా జ్యోతి.**

కల్హేర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో హరినందన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హరినందన్ రావు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు ఆరోగ్య, విద్యుత్, వ్యవసాయ, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.




# జిల్లాస్థాయిలో ముసాయిదా ఓటరు జాబితా విడుదల

## - సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్







**Publication of Draft Electoral Roll: 17.08.2026 (Monday)**

All EROs has published the notice on the Publication of Electoral Roll in Draft (Form-5) in their offices and all AERO/Tahsildar Offices, and all Polling Stations of the district.

| Sl. No | Name of the AC | Male | Female | Third Gender | Total |
|---|---|---|---|---|---|
| 1 | 35-Narayankhed | 105138 | 103079 | 8 | 208225 |
| 2 | 36-Andole (SC) | 109217 | 113361 | 3 | 222581 |
| 3 | 38-Zaheerabad (SC) | 116353 | 115536 | 2 | 231891 |
| 4 | 39-Sangareddy | 100309 | 104366 | 6 | 204681 |
| 5 | 40-Patancheru | 144050 | 147685 | 45 | 291780 |
| | Total | 575067 | 584027 | 64 | 1159158 |

➢ Period for filing Claims & Objections - 17.08.2026 to 16.09.2026

➢ Notice Phase / Disposal of Claims & Objections -17.08.2026 to 15.10.2026

**Publication of Draft Electoral Roll: 19.10.2026 (Monday)**

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 17:-** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ా×=) కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు.

ముసాయిదా ఓటరు జాబితాలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.

జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా, మార్పులు లేదా సవరణలు అవసరమైనా 2026 సెప్టెంబర్ 16లోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత విధానంలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలు లేదా సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ విషయంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.

### జిల్లాలో 11,59,158 మంది ఓటర్లు

జిల్లాలోని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం మొత్తం 11,59,158 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరిలో 5,75,067 మంది పురుషులు, 5,84,027 మంది మహిళలు, 64 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు:

35నారాయణఖేడ్: 2,08,225 మంది

36ఆందోల్: 2,22,581 మంది

38జహీరాబాద్: 2,31,891 మంది

39సంగారెడ్డి: 2,04,681 మంది

40పటాన్‌చెరు: 2,91,780 మంది

అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, అనర్హుల పేర్లు తొలగించి పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే ా×= ప్రక్రియ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హత కలిగిన వ్యక్తులు, అలాగే ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు కోరుకునే వారు నిర్దేశిత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు లేదా సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాపై అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి అక్టోబర్ 15, 2026లోగా పరిష్కరించి, అనంతరం తుది ఓటరు జాబితాను రూపొందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలు సంబంధిత జు=ాలు, ాజు=ాలు/తహసీల్దార్ కార్యాలయాలతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఈ నెల 18 న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 17:-**




సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని ఈ నెల 18న సంగారెడ్డి కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 18 న ఉదయం 10:30 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళు లర్పించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# ప్రభుత్వ సీలింగ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలి

## - నిబంధనలు అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

## - జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ కమిషన్ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 17:** నాగల్గిద్ద మండలం ఔదత్పూర్ గ్రామంలోని ప్రభుత్వ సీలింగ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన అధికారులు, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ కమిషన్ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం డిమాండ్ చేశారు. సోమవారం నాగల్గిద్ద మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ రహీం మాట్లాడుతూ.. ఔదత్పూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 12, 15లో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూములను గత ప్రభుత్వ హయాంలో కొందరు దళారులు, అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకపు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములని తెలిసినప్పటికీ కొందరు రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లకు సహకరించారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై గతంలోనే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్లకు ఆధారాలతో ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమార్కులకు మరింత ధైర్యం వస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఈ భూవ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన అధికారులు, దళారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లను నిబంధనల ప్రకారం రద్దు చేసి, సదరు ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో తగిన చర్యలు తీసుకోకపోతే బాధితుల తరపున, కమిషన్ ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేపడతామని హెచ్చరించారు.

# అనుమతులు లేకుండానే చెరువు నీటికి ఎసరు?

- కిలోమీటరు మేర కాలువ తవ్వి చేపల చెరువుకు నీటి తరలింపు
- భారీ మోటార్లతో నీటిని తోడుతున్న వైనం..
- అనుమతులు ఉన్నాయంటున్న నిర్వాహకులు
- అనుమతులు లేవు.. చర్యలు తీసుకుంటాం: ఇరిగేషన్ అధికారులు
- చేపల చెరువుల నీటితో కాలుష్య భయం..
- పెద్ద చెరువు చేపలకు నష్టం వాటిల్లుతుందని గ్రామస్తుల ఆందోళన









**అందోల్, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):**

కన్సాన్‌పల్లి 'పెద్ద చెరువు' నుంచి చేపల చెరువులకు నీటిని తరలిస్తున్న వ్యవహారం వివాదాస్పదంగా మారింది. పెద్ద చెరువులో నుంచి సుమారు కిలోమీటరు మేర భారీ కాలువ తవ్వి, భారీ మోటార్లు, పైపులు ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులో ఇంత పెద్ద స్థాయిలో తవ్వకాలు, నీటి తరలింపు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చేపల చెరువుల నిర్వాహకులు తమకు ఇరిగేషన్ అనుమతులు ఉన్నాయని చెబుతున్నప్పటికీ.. ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేయడంతో వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది. అసలు అనుమతులు ఎవరు ఇచ్చారు? ఎవరి అనుమతితో చెరువులో కాలువ తవ్వారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అధికారుల మాటల్లోనే స్పష్టత.. అనుమతులు లేవు!**

ఈ వ్యవహారంపై ప్రజాజ్యోతి ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా, అందోల్ మండల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రోహిత్ స్పందిస్తూ.. "చెరువులో నుంచి కాలువ తీసి మోటార్లతో నీటిని తోడేందుకు ఎలాంటి అనుమతులు లేవు. గ్రామస్తుల ద్వారా ఈ విషయం మా దృష్టికి వచ్చింది. అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.వట్పల్లి మండల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అరుణ మాట్లాడుతూ.. "నేను ఇటీవలే బదిలీపై ఈ ప్రాంతానికి వచ్చాను. మా ఆధ్వర్యంలో చేపల చెరువు కోసం ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. గతంలో ఏమైనా అనుమతులు ఇచ్చారా అనే విషయాన్ని డీఈతో చర్చించి పరిశీలించి చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

**కిలోమీటరు కాలువ.. అధికారులకు తెలియకుండానే?**

చెరువు నుంచి సుమారు కిలోమీటరు మేర కాలువ తవ్వి, భారీ మోటార్లు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్న నేపథ్యంలో.. ఇంత పెద్ద స్థాయిలో పనులు జరిగినా అధికారులు ముందుగానే ఎందుకు గుర్తించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికారులు అనుమతులు లేవని చెబుతున్న నేపథ్యంలో వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**చెరువు నీటి నాణ్యతపై ఆందోళన**

చేపల చెరువుల నుంచి వచ్చే నీరు పెద్ద చెరువులోకి చేరితే నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పెద్ద చెరువులోని చేపలకు నష్టం వాటిల్లడంతో పాటు నీటి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. చెరువు సహజ స్వరూపాన్ని కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఇక చర్యలు తప్పవా?**

ఇరిగేషన్ అధికారులు స్వయంగా అనుమతులు లేవని స్పష్టం చేయడంతో ఇప్పుడు వారి తదుపరి చర్యలపై గ్రామస్తుల్లో ఆసక్తి నెలకొంది. కాలువ తవ్వకాలు, మోటార్ల ఏర్పాటు, నీటి తరలింపుపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులెవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే గతంలో ఏవైనా అనుమతులు ఇచ్చారా? అనే అంశాన్ని కూడా అధికారులు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.
అనుమతులు లేవని అధికారులు చెబుతున్న వేళ.. కిలోమీటరు మేర కాలువ ఎలా ఏర్పడింది? భారీ మోటార్లతో నీటి తరలింపు ఎలా కొనసాగుతోంది? అన్న ప్రశ్నలకు అధికారుల చర్యలే సమాధానం చెప్పాల్సి ఉంది.

## వెల్దుర్తిలో భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఆగస్టు 17:**





వెల్దుర్తి పట్టణంలో నాగుల పంచమి పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు పుట్టల వద్దకు చేరుకుని పుట్టలకు పాలు పోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్ర దాయబద్ధంగా పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగదేవతను దర్శించుకుని, గ్రామ ప్రజలు మరియు కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.నాగుల పంచమి సంద ర్భంగా పుట్టల వద్ద మహిళలతో సందడి నెలకొంది. భక్తుల రాకతో ఆలయాలు, పుట్టల పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

- అభివృద్ధి పనులపై సమీక్ష. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం.

**కొండాపూర్ ప్రజా జ్యోతి**



కొండాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నేడు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీడీవో సౌమ్యశ్రీ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య, వైద్యం తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకురానున్నారు. గత సమావేశాల్లో ప్రస్తావించిన అంశాలపై పురోగతిని కూడా సమీక్షించే అవకాశం ఉంది.సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. మండల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు, సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.